# మానవ నిర్మిత విపత్తులు

వాతావరణంలో మార్పులు, రుతువులు ఏర్పడటం, భూ అంతర్భాగంలో సర్దుబాట్లు వంటి అనేక కారణాల వల్ల సహజ విపత్తులు సంభవిస్తున్నాయి. వీటితో పాటు మనుగడ కోసం మానవుడు నిర్వహించే వివిధ ప్రత్యక్ష, పరోక్ష కార్యకలాపాల వల్ల సంభవించేవి మానవకారక విపత్తులు. రోడ్డు ప్రమాదాలు, అంటువ్యాధులు, అగ్ని ప్రమాదాలు, రసాయన విస్ఫోటనాలు, యుద్ధాలు, ఉగ్రవాదం, పౌర సంఘర్షణ యుద్ధాలు, మొదలైనవి ఈ కోవకు చెందినవి. ఈ విపత్తులు మానవుడి నిర్లక్ష్యం, తొందరపాటు, వంటి అనేక కార్యకలాపాల వల్ల తక్షణమే లేదా నిదానంగా సంభవిస్తున్నాయి. సహజ విపత్తులతో పోల్చుకుంటే వీటి వల్ల ప్రమాదం ఎక్కువ. అధిక సంఖ్యలో కర్బన రసాయనాలు ఉద్గారం చేయడం వల్ల భూగోళం మెల్లగా వేడెక్కి ప్రపంచంలో ఉన్న మొత్తం మంచు కరగడం వల్ల సముద్ర మట్టం పెరిగే అవకాశముంది. మన పర్యావరణాన్ని చేజేతులా నాశనం చేసుకోవడం వల్ల మానవ కారక విపత్తులతో పాటు సహజ విపత్తులు సంభవించి తీవ్ర నష్టాన్ని కల్గిస్తున్నాయి. దీని వల్ల ఆయుఃప్రమాణం తగ్గడం, ఆహార కొరత ఏర్పడటం, అంటు వ్యాధులు ప్రబలడం వంటి అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి.

**కారణాలు:** ఇవి రెండు రకాల చర్యల వల్ల సంభవిస్తున్నాయి. అవి

**1. ప్రత్యక్ష చర్యలు:** ఈ చర్యల వల్ల నష్టం నేరుగా ఉంటుంది. ఉదాహరణకు రోడ్డు ప్రమాదాలు, ఉగ్రవాదం, పౌర సంఘర్షణ, యుద్ధాలు. ఈ విపత్తుల్లో మానవుడు ప్రత్యక్షంగా పాల్గొంటాడు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లుతుంది.

**2. పరోక్ష చర్యలు:** పరోక్ష చర్యల వల్ల కలిగే నష్టం భవిష్యత్తులో ఉంటుంది. అడవులను నిర్మూలించడం వల్ల వర్షాలు కురవక పోవడం, భూగర్భజలాలు తగ్గిపోవడం, పంటలు దిగుబడి తగ్గి కరువు ఏర్పడటం, అధికంగా వెలువడుతున్న రసాయనాల వల్ల భూగోళం వేడెక్కడం, కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడం, ఆయుఃప్రమాణం తగ్గిపోవడం వంటివి మానవుడి పరోక్ష చర్యల వల్ల సంభవిస్తాయి.

**మానవ కారక విపత్తులు-రకాలు:**

**1. రోడ్డు ప్రమాదాలు (Road Accidents):** మానవ కారక విపత్తుల్లో రోడ్డు ప్రమాదాలది ప్రథమ స్థానం. పెరిగిన వాహనాల సంఖ్య, అధిక వేగం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వంటి చర్యల వల్ల నిత్యం ఎన్నో రకాల ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి వల్ల కొన్ని వేల మంది మరణించడంతో పాటు లక్షల మంది గాయపడి వికలాంగులుగా మారుతున్నారు. 2010 సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన 5 లక్షల రోడ్డు ప్రమాదాల్లో 1,34,513 మంది మరణించారు. 5 లక్షల కంటే ఎక్కువ మంది గాయపడ్డారు. ఎక్కువగా 25 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సులో వారే ప్రమాదాలకు గురవుతున్నారు. కాలినడకన వెళ్లేవారు, ద్విచక్రవాహనాలు(సైకిల్, బైక్స్) నడిపేవారు ఎక్కువ సంఖ్యలో

ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అధికంగా మరణాలకు కారణమవుతున్న వాటిలో రోడ్డు ప్రమాదాలు ప్రస్తుతం 9 స్థానంలో ఉన్నాయి. 2030 నాటికి ఇవి 5వ స్థానంలోకి చేరతాయని అంచనా. అందుకే ఐక్యరాజ్య సమితి 2011-20 దశాబ్దాన్ని రోడ్డు భద్రతపై చర్యల కోసం Decade of Action for Road Safety దశాబ్దంగా ప్రకటించి సభ్యదేశాలను 2020 నాటికి అన్ని రకాల రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించింది. World Health Organization ప్రకారం ప్రపంచంలో రోడ్డు ప్రమాదాల వల్ల అధిక ప్రాణనష్టం జరుగుతున్న దేశాల్లో మనది మొదటి స్థానం.

### దేశంలో 2001-10 మధ్యలో జరిగిన ప్రమాదాలు, మృతుల సంఖ్య:

| సంవత్సరం | ప్రమాదాల సంఖ్య | మృతుల సంఖ్య | గాయపడిన వారు |
|---|---|---|---|
| 2001 | 405,637 | 80,888 | 405,216 |
| 2002 | 407,497 | 84,674 | 408,711 |
| 2003 | 406,726 | 85,998 | 4,35,122 |
| 2004 | 429,910 | 92,618 | 464,521 |
| 2005 | 439,255 | 94,968 | 465,282 |
| 2006 | 460,920 | 105,749 | 496,481 |
| 2007 | 479,216 | 114,444 | 513,340 |
| 2008 | 484,704 | 119,860 | 523,193 |
| 2009 | 486,384 | 125,660 | 515,458 |
| 2010 | 499,628 | 134,513 | 527,512 |

1980 నుంచి దేశవ్యాప్తంగా జరిగిన రైలు ప్రమాదాల వల్ల దాదాపు 5 వేల మంది మరణించారు. 25 వేల మంది గాయపడ్డారు. రైలు పట్టాలు తప్పడం, రైళ్లలో మంటలు వ్యాపించడం వంటి వాటి వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఉదాహరణకు 2012 జులైలో నెల్లూరు వద్ద తమిళనాడు ఎక్స్‌ప్రెస్ అగ్ని ప్రమాదానికి గురవడం వల్ల 30 మంది మరణించారు. అలాగే 2002 ఫిబ్రవరి 27న అహ్మదాబాద్ నుంచి బయలుదేరిన సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో గోద్రా వద్ద సంభవించిన అగ్ని ప్రమాదంలో 59 మంది కరసేవకులు సజీవ దహనమయ్యారు. దీంతో గుజరాత్‌లో చెలరేగిన అల్లర్ల వల్ల దాదాపు 1100 మంది పైగానే మరణించారు. ఈ అల్లర్లపై జస్టిస్ నానావతి కమీషన్, కె. జి. షా కమిటీని నియమించారు. ఈ విధంగా దేశంలో అనేక రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటితో పాటు విమానాలు కూలిపోవడం, పడవలు మునిగిపోవడం వంటి వాటి వల్ల కూడా ఏటా వందల మంది మరణిస్తున్నారు. 1996 నవంబర్‌లో సౌదీ అరేబియాకు చెందిన విమానం ప్రమాదానికి గురై 349 మంది దుర్మరణం పాలయ్యారు. 1988లో అహ్మదాబాద్ వద్ద జరిగిన విమాన ప్రమాదంలో 124 మంది మరణించారు.

## ప్రపంచ వ్యాప్తంగా అధిక సంఖ్యలో మరణాలకు కారణమవుతున్న అంశాలు వాటి శాతం

| అంశం | శాతం |
|---|---|
| 1. Heart disease | 12.2 |
| 2. Cerebrovascular disease | 9.7 |
| 3. Lower respiratory infections | 7.0 |
| 4. Chronic Obstructive pulmonary disease | 5.1 |
| 5. Diarrhoeal diseases | 3.6 |
| 6. HIV/AIDS | 3.5 |
| 7. Tuberculosis | 2.5 |
| 8. Trachea, bronchus, lung cancers | 2.3 |
| 9. Road traffic injuries | 2.2 |
| 10. Prematurity and low birth weight | 2.0 |

**అంటువ్యాధులు(communicable diseases):** మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచకపోవడం, దోమలు, ఈగలు, పందులు, కుక్కలు, వంటి అనేక వాహకాల ద్వారా వ్యాధులు సోకిన వారి నుంచి వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్‌లు మన శరీరంలోకి ప్రవేశించడం వల్ల అంటువ్యాధులు సంభవిస్తున్నాయి. దేశంలో దాదాపు 30 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారు. సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం, పరిశుభ్రమైన నీరు, ఆహారం అందకపోవడం, వంటి కారణాల వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. సురక్షిత లైంగిక సంబంధాలు లేకపోవడం వల్ల సుఖవ్యాధులు, ఎయిడ్స్ వ్యాపిస్తున్నాయి. 2001లో నమోదైన 2 మిలియన్ల మలేరియా కేసుల్లో 972 మంది మృతి చెందారు. వీటితో పాటు పోలియో, కుష్టువ్యాధి, క్షయ, కాలాఅజార్ వంటి అనేక వ్యాధులు సంభవిస్తున్నాయి. మలేరియా వల్ల ప్రపంచంలో ఏటా 10 లక్షల మది మరణిస్తున్నారు. ఆగ్నేయ ఆసియాలో ఏటా మలేరియా సోకుతున్న 2.5 మిలియన్లలో 77 శాతం మంది భారత్‌లోనే ఉన్నారు. వీటితో పాటు అంటు వ్యాధులు కాని గుండెపోటు, క్యాన్సర్, ఎయిడ్స్, డయాబెటిస్ వంటి అనేక వ్యాధుల వల్ల వేల మంది మృత్యువాత పడుతున్నారు.

అమెరికాలో 2001లో కొన్ని వేల మంది ఆంత్రాక్స్ బారిన పడ్డారు. జీవ సంబంధ విపత్తులను poor man's nuclear bomb అంటారు. ఎందుకంటే ఇవి చాలా సులభంగా వ్యాపిస్తాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలు తగిన సౌకర్యాలు లేని ప్రాంతాల్లో నివసించడం, అపరిశుభ్ర వాతావరణం, కాలుష్యం వల్ల త్వరితగతిన అంటువ్యాధులు సంభవిస్తాయి.

ప్రపంచ వ్యాప్తంగా 2010లో 1.24 మిలియన్ల మంది మలేరియా వ్యాధివల్ల మరణించినట్లు వరల్డ్ మలేరియా రిపోర్ట్-2011(డబ్ల్యూఎంఆర్) పేర్కొంది. ఇది గతంలో అంచనా వేసిన దాని కంటే రెండింతలు ఎక్కువ. 1980 నుంచి 2010 వరకు స్వీకరించిన సమాచారం ద్వారా నివేదిక రూపొందించారు. 2010లో భారత్‌లో 46,800 మంది మలేరియాతో మరణించారని నివేదిక తెలిపింది.

**రసాయన విస్ఫోటనం:** పరిశ్రమలు, ఇతర రసాయనిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రదేశాల్లో రసాయనాల సరైన నిర్వహణ లేకపోవడం వల్ల విస్ఫోటనాలు సంభవిస్తున్నాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడం, విషవాయువులు వెలువడటం వల్ల వేల మంది మరణిస్తున్నారు. ఉదాహరణకు..

**1. భోపాల్ గ్యాస్ దుర్ఘటన:** 1984 డిసెంబర్ 3 న మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో Union Carbide India Limited (UCIL) అనే క్రిమిసంహారక మందుల ప్లాంట్‌లో తలెత్తిన విస్ఫోటనం వేల మందిని పొట్టన పెట్టుకుంది. ఈ సంఘటనలో వెలువడిన 40 టన్నుల Methyl Isocyanate (MIC) అనే విషవాయువు వల్ల ఊపిరాడక దాదాపు 3000 కంటే ఎక్కువ మంది మరణించారు. 5 లక్షలకు పైగా గాయపడటం, వికలాంగులుగా మారడం జరిగింది. దీని ప్రభావం వల్ల తర్వాత కాలంలో కూడా చాలామంది మరణించారు.

**2. చెర్నోబిల్ అణు విస్ఫోటనం:** 1986లో ఏప్రిల్ 26న ఉక్రెయిన్(రష్యా)లోని చెర్నోబిల్ అణువిద్యుత్ కర్మాగారంలో సంభవించిన ప్రమాదం వల్ల 56 మంది అక్కడికక్కడే మృతి చెందారు. వాతావరణంలో కలిసిపోయిన రేడియోధార్మికత వల్ల ఆ ప్రాంతంలో వేల మంది మరణానికి ఈ సంఘటన పరోక్ష కారణమైంది.

**3. హిరోషిమా అణుబాంబు దాడి:** రెండో ప్రపంచ యుద్ధకాలంలో 1945 ఆగస్టు 6, 9 తేదీల్లో అమెరికా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిపై వేసిన అణుబాంబు వల్ల హిరోషిమాలో 66 వేల మంది నాగసాకిలో 39 వేల మంది మరణించారు. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలో కొన్ని వందల సంవత్సరాల వరకు జీవరాశి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. హిరోషిమాపై వేసిన బాంబుపేరు లిటిల్‌బాయ్, నాగసాకిపై వేసిన బాంబుపేరు ఫ్యాట్ మ్యాన్.

**అగ్నిప్రమాదాలు:** మంటలు వ్యాపించడం, రసాయనాలు ఒలికిపోవడం, విద్యుత్ షాట్‌సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి. దట్టమైన అడవులు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, పరిశ్రమలు, కార్యాలయాలు వంటి ప్రదేశాల్లో ఇవి ఎక్కువగా సంభవిస్తాయి. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, మంటలు ఆర్పే సాధనాలు అందుబాటులో లేకపోవడం వల్ల వీటి తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. అడవుల్లో అగ్ని ప్రమాదం సంభవించడం వల్ల వేల సంఖ్యలో జీవరాశి మరణిస్తుంది. పెద్ద మొత్తంలో వృక్ష సంపద నాశనమవుతుంది. అటవీ ఉత్పత్తులు లభించవు. దీని వల్ల అడవులపై ఆధారపడిన వారికి ఉపాధి కరువవుతుంది. అక్కడ జీవ వైవిధ్యం దెబ్బ తింటుంది.

**కొన్ని ముఖ్యమైన అగ్ని ప్రమాదాలు:**

1. 2012 సెప్టెంబర్ 5 న తమిళనాడులోని శివకాశి(బాణసంచా తయారీకి ప్రసిద్ధి) లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 52 మంది మరణించారు. ఇక్కడ ప్రతి సంవత్సరం ప్రమాదాలు సంభవించడం పదుల సంఖ్యలో కార్మికులు చనిపోవడం జరుగుతుంది.

2. అలాగే 2011 డిసెంబర్‌లో కలకత్తాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి(AMRI hospital)లో జరిగిన అగ్నిప్రమాదంలో 73 మంది మరణించారు.

3. 2006 ఏప్రిల్ 10న మీరట్‌లో జరిగిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల 64 మంది మరణించారు.

4. జులై 16 2004లో తమిళనాడు రాష్ట్రం కుంభకోణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సంభవించిన అగ్ని ప్రమాదం వల్ల 91 మంది మరణించారు.

5. 1995 డిసెంబర్ 23న హర్యానాలో ఓ పాఠశాల కార్యక్రమంలో జరిగిన అగ్నిప్రమాదం వల్ల 425 మంది మరణించారు.

**ఉగ్రవాదం, నక్సలిజం:** ప్రపంచంలో అన్ని విపత్తుల కంటే ఉగ్రవాదం అతి భయంకరమైంది. రాజ్యాలు, ఆస్తులు, పదవులు, మతాలు, ఇతర కారణాల వల్ల మనుషులను చంపుకోవడం అనాదిగా వస్తున్నా, గత శతాబ్ద కాలంలో ఉగ్రవాదం వేళ్లూనుకుంది. ఆత్మాహుతి దాడులు, బాంబు పేలుళ్ల, కాల్పులు వంటి దుశ్చర్యల వల్ల హింసాకాండకు పాల్పడుతున్నారు. భారత్‌లో ప్రధానంగా ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, పుణె, బెంగళూరు, కలకత్తా, అహ్మదాబాద్, జైపూర్, వారణాసి, అస్సాం, వంటి మెట్రోపాలిటన్ నగరాల్లో ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారు. షాపింగ్‌మాల్స్, ఆసుపత్రులు, హోటల్‌లు వంటి రద్దీ ప్రాంతాలే లక్ష్యంగా బాంబులు, కాల్పుల వర్షం కురిపిస్తున్నారు. ముఖ్యంగా ఇవి ముంబయి నగరంలో ఎక్కువగా జరుగుతుంటాయి. దేశంలో గత 10 సంవత్సరాల్లో దాదాపు 1500 మంది ఉగ్రవాదుల దాడికి బలయ్యారు.

**దేశంలో ముఖ్యమైన బాంబు దాడులు:**

| సంవత్సరం | ప్రదేశం | మృతుల సంఖ్య |
|---|---|---|
| 1993 మార్చి12 | ముంబై | 257 |
| 2003 ఆగస్టు 25 | ముంబై | 50 |
| 2006 జులై 11 | ముంబై | 209 |
| 2008 నవంబర్ 26 | ముంబై(తాజ్, ఒబెరాయ్, నారిమన్) | 172 |
| 2001 జులై 13 | ముంబై | 26 |
| 2010 ఫిబ్రవరి 13 | పుణె | 17 |
| 2005 అక్టోబర్ 29 | న్యూఢిల్లీ | 62 |
| 2002 సెప్టెంబర్, 24 | గాంధీనగర్ | 34 |
| 2006 సెప్టెంబర్ 8 | మాలేగావ్, మహారాష్ట్ర | 40 |
| 2007 ఫిబ్రవరి 19 | సంఝౌతా ఎక్స్‌ప్రెస్ | 66 |
| 2007 ఆగస్టు 25 | హైదరాబాద్ | 42 |
| 2008 మే 13 | జైపూర్ | 68 |

| | | |
|---|---|---|
| 2008 జులై 26 | అహ్మదాబాద్ | 57 |
| 2008 అక్టోబర్ 30 | అస్సాం | 77 |
| 2008 అక్టోబర్ 21 | ఇంఫాల్ | 17 |
| 2008 సెప్టెంబర్ 13 | న్యూఢిల్లీ | 26 |
| 2006 మార్చి | వారణాసి | 20 |
| 2011 జులై | దలాల్‌స్ట్రీట్, ముంబై | 26 |

జమ్మూ కాశ్మీర్, చత్తీస్‌ఘడ్, బీహార్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో నక్సలిజం లేదా మావోయిజం పాతుకు పోయింది. వీరు తరచుగా రక్షణ బలగాలపై విరుచుకు పడుతుంటారు. ఈ దాడుల్లో కొన్ని వేల మంది జవానులు, పోలీసులు, సామాన్య ప్రజానీకం ప్రాణాలు కోల్పోతుంటారు. కారణాలేమైనా దీని వల్ల ఏటా కొన్ని వేల మంది మరణిస్తున్నారు. 1992, 1999లో బీహార్‌లోని భూమిహార్‌లో నక్సలైట్ల దాడిలో వరుసగా 36, 34 మంది మరణించారు. 2004లో చత్తీస్‌ఘడ్‌లోని దంతెవాడ జిల్లాలో నక్సలైట్ల చేతిలో 50 మంది పోలీసులు, 300 మంది గ్రామస్థులు మృతి చెందారు. 2010లో దంతెవాడలో జరిగిన కాల్పుల్లో 44, పశ్చిమ బెంగాల్‌లో 148 మంది మరణించారు. 2010లోనే జరిగిన మరో సంఘటనలో దంతెవాడలో 76 మంది మృతిచెందారు. 2009లో నక్సలైట్లను ఏరి వేయడానికి భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో 126 మంది పోలీసులు, 90 మంది నక్సలైట్లు చనిపోయారు.

**యుద్ధాలు:** పూర్వకాలం నుంచి రాజ్యాల కోసం యుద్ధాలు జరుగుతున్నా ఆధునిక కాలంలో చాలా దేశాలు స్వాతంత్ర్యం, ఆధిపత్యం కోసం, యుద్ధాలు చేయాల్సి వచ్చింది. ఇవి కూడా అతి పెద్ద విపత్తులే. అమెరికా యుద్ధం, ఫ్రెంచ్ విప్లవం, రష్యా యుద్ధం, రెండు ప్రపంచ యుద్ధాలు, భారత్-పాక్ యుద్ధాలు, భారత్-చైనా యుద్ధాలు, అమెరికా-ఇరాక్ యుద్ధాలు వీటికి ఉదాహరణలు. ఈ యుద్ధాల్లో కొన్ని కోట్ల మంది మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలోనే అన్ని దేశాల్లో కలిపి దాదాపు 6 కోట్ల కంటే ఎక్కువ మంది మరణించారు. భారత్ పాక్ మధ్య 1999 లో జరిగిన కార్గిల్ యుద్ధంలో 527 భారత్ సైనికులు, 453 పాకిస్తాన్ సైనికులు మరణించారు. దీంతోపాటు 1965, 1971 లో భారత్ పాక్ యుద్ధాల్లో దాదాపు 2500 మంది పాక్ సైనికులు మరణించారు. 2003 లో అమెరికా-ఇరాక్‌కు జరిగిన యుద్ధంలో 24 వేలమంది అమెరికా, 28 వేల మంది ఇరాక్ సైనికులు మరణించారు. ఇరాక్ అధిక సంఖ్యలో మారణాయుధాలు కలిగి ఉందనే ఉద్దేశంతో అమెరికా యుద్ధానికి దిగింది. ఈ యుద్ధంలోనే weapons of mass destruction (WMD) అనే పదం వాడుకలోకి వచ్చింది.

వీటితో పాటు ఆధిపత్య పోరు, రాజకీయాలు, కక్ష్యల వల్ల హత్యలు, అత్యాచారాలు, వంటి అసాంఘిక కార్యకలపాలు పెరిగిపోతున్నాయి. దీంతో మానవుడు తన వినాశనాన్ని తానే కొని తెచ్చుకుంటున్నాడు.

**మానకకారక విపత్తుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు:**

1. మానవ కారక విపత్తులను నివారించడం మానవుడి ప్రాథమిక బాధ్యత. ఇది మన విచక్షణపై ఆధారపడి ఉంటుంది. సమాజ శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగడం వల్ల మానవ కారక విపత్తులను పూర్తిగా నివారించవచ్చు.

2. అధిక సంఖ్యలో పెరిగిపోతున్న వాహనాలు వాటిని సరిగా వినియోగించక పోవడం, అధిక వేగం, వాతావరణ కారణాల వల్ల గత దశాబ్ద కాలంలో కొన్ని కోట్ల మంది మరణించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం, వాహనాలను తగిన జాగ్రత్తలతో ఉపయోగించడం వల్ల రోడ్డు ప్రమాదాలను దాదాపుగా నివారించవచ్చు.

3. పరిశ్రమలు, నివాస ప్రాంతాలు, షాపింగ్ మాల్స్, ఎక్కువ జన సందోహం ఉండే ప్రాంతాల్లో తగిన భద్రతా ప్రమాణాలు పాటించడం వల్ల అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చు. పరిశ్రమలను జనావాసాలకు దూరంగా నిర్మించడం, అన్ని రకాల భద్రతా ప్రమాణాలు కలిగిన వస్తువులు ఉపయోగించడం వల్ల రసాయన విస్ఫోటనాలను నివారించవచ్చు.

4. వాతావరణ కాలుష్యాన్ని నివారించడం, పరిశుభ్రత కలిగిన పరిసరాలు, ఆహారం కలిగి ఉండటం వల్ల అంటు వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు.

5. అడవులను పరిరక్షించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడటంతో వాతావరణ సమతుల్యత సాధించడం వల్ల కరువు వంటి విపత్తులను నివారించవచ్చు.

6. విచక్షణా జ్ఞానంతో అసాంఘిక కార్యకలాపాలను విడనాడటం వల్ల ఉగ్రవాదం వంటి క్రూర చర్యలను నివారించవచ్చు. సులభంగా ఆయుధాలు, ఇతర పేలుడు పదార్థాలు అందుబాటులో ఉంచడం వల్ల ఉగ్రవాదం పెరిగిపోతోంది.

7. ఇతర దేశాలతో సత్సంబంధాలను నెలకొల్పుకోవడం వల్ల యుద్ధాలు చేయాల్సిన అవసరం ఉండదు.